క్లుప్తంగా

నోటరీ న్యాయవాదుల నియామకాలు చేపట్టాలి



సత్తెనపల్లి: నోటరీ న్యాయవాదుల నియామకాలను రాష్ట్ర ప్రభుత్వం, న్యాయ, రిజిస్ట్రేషన్ శాఖలు తక్షణమే చేపట్టాలని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, సత్తెనపల్లి బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు నరిశేటి వేణుగోపాల్ ఆదివారం డిమాండ్ చేశారు. మరో 400 మంది నోటరీలను నియమించుకోనే అవకాశాన్ని కేంద్ర ప్రభుత్వం ఏపీకి కల్పించిందన్నారు. అనేక సంవత్సరాలుగా నోటరీ నియామకాలు జరగకపోవడంతో న్యాయవాదులు ఎదురు చూపులు చూస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో తక్షణమే నోటిఫికేషన్ విడుదల చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

కొత్తపేటలో దసరా ఉత్సవాలు



సత్తెనపల్లి: పట్టణంలోని, కొత్తపేటలో ఉన్న మహాలక్ష్మమ్మ చెట్టు వద్ద 12వ దేవి శరన్నవ రాత్రి ఉత్సవాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. నాల్గవ రోజు ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన అన్నప్రసాద కార్యక్రమాన్ని సత్తెనపల్లి డీఎస్పీ మేదరమెట్ల హనుమంత రావు ప్రారంభించారు. ముందుగా అమ్మవారికి పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆర్య వైశ్య నాయకులు చౌట శ్రీనివాసరావు, దివ్వెల శ్రీనివాసరావు కమిటీ బాధ్యులు లఘుమవరపు రమేష్, కటకం మారుతి, యక్కల సాంబశివ రావు, కొప్పురావూరి కాశీ, 15 మంది మహిళా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు మహిళా చట్టాలపై అవగాహనా సదస్సు

సత్తెనపల్లి: జాతీయ న్యాయ సేవాధికార కమిటీ, జాతీయ మహిళా కమిషన్ సంయుక్త నిర్వహణలో పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపంలో సోమవారం ఉదయం 11 గంటలకు మహిళా పరిరక్షణ చట్టాలపై అవగాహనా సదస్సు జరుగుతుందని సత్తెనపల్లి మండల న్యాయ సేవాధికార కమిటీ బాధ్యులు ఆదివారం తెలిపారు. ఈ సదస్సులో న్యాయమూర్తులు, ఇతర న్యాయ నిపుణులు పాల్గొని మహిళా పరిరక్షణకు ఉన్న చట్టాలపై అవగాహన కల్పిస్తారన్నారు. సదస్సుకు అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

జాతీయ ఖోఖో పోటీలకు విద్యార్థిని ఎంపిక



కారెంపూడి: ఒప్పిచర్ల గ్రామంలోని గాడిపర్తి లక్ష్మీ మెమోరియల్ జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని షేక్ మహిమున్నీసా జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైందని ఆ పాఠశాల హెచ్ఎం ఎం విజయలలిత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తమిళనాడులోని కోయంబత్తూర్‌లో ఈనెల 16 నుంచి 18 వరకు జరగనున్న ఖేలో ఇండియా సౌత్ జోన్ జాతీయ పోటీలలో మన రాష్ట్ర సబ్ జూనియర్ బాలికల జట్టులో ఆడనున్నారని తెలిపారు. ఇటీవల స్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రకాశం జిల్లా జే పంగులూరులో నిర్వహించిన రాష్ట్ర జట్టు ఎంపికలో ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టు తరఫున పాల్గొని మహిమున్నీసా రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారని హెచ్ఎం పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థినిని, శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు సీహెచ్ చినరత్తయ్యను హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

మరమ్మతు పనుల పరిశీలన



మాచర్ల: పట్టణంలో జరుగుతున్న పలు మరమ్మతు పనులను మున్సిల్ చైర్మన్ పోలూరి నరసింహారావు ఆదివారం పరిశీలించారు. ఆదివారం ఉదయం ఆయన గుడ్‌మార్నింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రామాటాకీస్‌లైన్, వెంకటేశ్వర థియేటర్, పురపాలక సంఘ కార్యాలయం, 10వ వార్డు, రోప్‌వే కాలనీ తదితర ప్రాంతాఆల్లో పర్యటించారు. మురుగు కాలువల్లో మరమ్మతు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

జూదరుల అరెస్ట్

అమరావతి: మండల పరిధిలోని ఉంగుటూరు గ్రామ శివారులో ఆదివారం ఐదుగురు పేకాట జూదరులను అరెస్టు చేశారు. అమరావతి పోలీసులు అందిన సమాచారం మేరకు పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.43,200లు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి, సోమవారం కోర్టులో హాజరు పరుస్తామని పోలీసులు తెలిపారు.

ప్రియం.. ఫలహారం

- నిత్యావసరాల ధరలకు పోటీ
- ప్రతికూల వాతావరణ పరిస్థితులతో పండ్ల తోటలకు నష్టం
- పెరిగిన రవాణా చార్జీలూ మరో కారణం
- ధర ఎక్కువైనా తప్పని వ్యాపారం



పట్టణంలోని పారిశ్రామిక వాడ వద్ద రోడ్డు పక్కన విక్రయానికి సిద్ధంగా ఉన్న పండ్లు

సత్తెనపల్లి: బలవర్ధకమైన ఆహారంగా పేరున్న పండ్లకు ఎప్పుడూ డిమాండ్ ఉంటుంది. ఆయా సీజన్లలో దొరికే పండ్లు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుస్తాయి. పది రోజుల వ్యవధిలో పండ్ల రేట్లు కొండెక్కాయి. పట్టణంలో దుకాణాలు, తోపుడు బండ్లు, పట్టణ శివారులో రోడ్డు వెంబడి విక్రయాలు, గంపల్లో విక్రయాలు చేపట్టే పండ్ల వ్యాపారులు సుమారు 200 మంది వరకు ఉంటారు. ఇటీవల కాలంలో రవాణా చార్జీలు పెరగడంతో పండ్ల ధరలకు రెక్కలు వచ్చాయని వ్యాపారులు చెబుతున్నారు. పోషక పదార్థాలు అధికంగా ఉన్న డ్రాగన్ ఫ్రూట్‌కు ప్రస్తుతం డిమాండ్ ఉందని చెబుతున్నారు.

వాతావరణమే కారణం

పండ్ల ధరలు పెరగడానికి రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ప్రతికూల వాతావరణం ఓ కారణమని పండ్ల వ్యాపారులు చెబుతున్నారు. కొన్నిచోట్ల అధిక వర్షాలు, మరికొన్ని చోట్ల అధిక ఉష్ణోగ్రతలతో పండ్ల తోటలు దెబ్బతిన్నాయి. బొప్పాయి, అరటి, బత్తాయి తదితర వాటికి డిమాండ్ ఏర్పడినట్లు తెలుస్తోంది. దీనికి తోడు కొన్ని రకాల పండ్లు ఎక్కువ రోజులు అమ్ముడుపోక చెడిపోతుంటాయి. ఆ నష్టం భరించక తప్పదు. కొనుగోలుదారులకు నాణ్యమైన పండ్లు విక్రయించేందుకు ధర ఎక్కువైనా వ్యాపారులు తీసుకొస్తున్నారు. ఈ క్రమంలో కొద్ది రోజులుగా ధరలు కొంతమేర పెరిగాయని, కొనుగోలుదారులు ఇంత పెరిగాయా అంటున్నా ఎలా గోలా ఒప్పించి రిటైల్ పండ్ల వ్యాపారులు విక్రయాలు చేస్తున్నారు.



డ్రాగన్ ఫ్రూట్స్


రవాణా చార్జీల ప్రభావం

గతంతో పోలిస్తే రైళ్లలో రవాణా చార్జీలు కొంత మేర పెరగడంతో ఆ భారం హోల్‌సేల్ దుకాణదారులపై పడిందని, దీంతో పండ్ల ధరలు పెంచారని రిటైల్ పండ్ల వ్యాపారులు వెల్లడిస్తున్నారు. లారీ, డీసీఎం తదితర వాహనదారులు రవాణా చార్జీలు పెంచడం ఒక కారణంగా తెలుస్తోంది. పది రోజుల వ్యవధిలో 18 నుంచి 20 శాతం పండ్ల ధరలు పెరిగాయి. ధరల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

పండ్ల ధరలు ఇలా..

పండ్ల రకం	గత వారం ధర (కేజీ రూ.)	ఈ వారం ధర (కేజీ రూ.)
డ్రాగన్ ఫ్రూట్	180.00	200.00
యాపిల్ ఒకటో రకం	130.00	150.00
యాపిల్ రెండో రకం	100.00	120.00
దానిమ్మ	220.00	250.00
ద్రాక్ష రెండు రకాలు	80.00	100.00
కమల ఒకటో రకం	800.0	100.00
కమల రెండో రకం	50.00	70.00
బత్తాయి ఒకటో రకం	80.00	100.00
బత్తాయి రెండో రకం	50.00	70.00
అరటి పండ్లు(డజన్)	70.00	100.00
అరటి పండ్లు(డజన్)	50.00	70.00

సెలవుల్లో ఇల్లు జాగ్రత్త



సత్తెనపల్లి: దసరా సెలవులు వచ్చేశాయి. విహార యాత్రలు, సొంతూళ్లు, బంధువుల ఇళ్లకు వెళ్లేందుకు సన్నద్ధమవుతున్నారా ..? అయితే జర జాగ్రత్త. ఇదే అదునుగా దొంగలు కూడా మాటు వేసి ఉన్నారు. తాళాలు వేసిన ఇళ్లే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్నారు. గతంలో దసరా పండుగకు పలు ఇళ్లల్లో చోరీలు జరిగిన ఘటనలు ఉన్నాయి. నగదు, విలువైన బంగారం, వెండి వస్తువులు మాయమయ్యాయి. ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడంతో కొందరు తీవ్రంగా నష్టపోయారు.

సాంకేతిక పరిజ్ఞానంతో..చెక్

లాక్ట్ హౌస్ మానిటరింగ్ సిస్టం (ఎల్‌హెచ్‌ఎంఎస్) యాప్ .. సాంకేతిక పరిజ్ఞానంతో ఇళ్లల్లో దొంగతనాల్ని అడ్డుకునేందుకు ఉద్దేశించిన వ్యవస్థ. పోలీసు శాఖ దీన్ని అందు బాటులోకి తెచ్చింది. పట్టణంలో దీన్ని అమలు చేస్తున్నారు. ఇంటిని విడిచి కొన్ని రోజుల పాటు దూరంగా ఉండేవారు. పట్టణ పోలీస్ స్టేషన్‌ను సంప్రదిస్తే వారు ఇంట్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి దాంతో ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ ను అనుసంధానం చేస్తారు. తాళం వేసి ఉన్న ఇంటి తలుపులు ఎవరైనా తీసినా ... చోరీకి అవకాశమున్నా వెంటనే ఆ యాప్ పోలీసులను అప్రమత్తం చేసి క్షణాల్లో వారు అక్కడికి చేరేలా చేస్తుంది. ఈ యాప్‌ను సెలవుల్లో ఎక్కువమంది వినియోగించుకోవడం ద్వారా ఇంటిని భద్రంగా ఉంచుకోవచ్చు. చోరీల నివారణకు ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, వీధుల్లో ఎవరైనా అనుమానంగా సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, చోరీలను నివారణకు పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు పోలీసు లు విస్తృత ప్రచారం చేస్తున్నారు.

ప్రతి గ్రాడ్యుయేట్ ఓటు నమోదు చేయించాలి

ఎమ్మెల్యే కన్నా లక్ష్మీ నారాయణ

సత్తెనపల్లి: ప్రతి గ్రాడ్యుయేట్ ఓటును నమోదు చేయించాలని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీ నారాయణ అన్నారు. ఉమ్మడి కృష్ణ, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల విధి విధానాలపై ఆదివారం పట్టణంలోని రఘురాం నగర్‌లో గల టీడీపీ కార్యాలయంలో ముప్పాళ్ల, రాజుపాలెం మండల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిశీలకులుగా వేములకొండ శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలో జరగబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విద్యావంతులు, మేధావులు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఓట్లు నమోదుకు అవసరమైన పత్రాలు అన్నింటిని అందుబాటులో ఉంచాలన్నారు. ఓటు నమోదు కోసం ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతిభవంతులైన ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకునేలా పార్టీ నాయకులు చూడాలన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



అచ్చంపేట: వైభవలక్ష్మీగా సీతాదేవి



అచ్చంపేట: లక్ష్మీదేవి అలంకరణలో వాసవీమాత



క్రోసూరు: లలితత్రిపుర సుందరిగా వాసవి మాత



సత్తెనపల్లి: శ్రీలలిత త్రిపుర సుందరీదేవిగా వాసవీ మాత



సత్తెనపల్లి: త్రిశక్తి దుర్గాపీఠంలో అన్నపూర్ణాదేవి



బెల్లంకొండ: లలితా పరమేశ్వరిగా మహాలక్ష్మీ అమ్మవారు



ముప్పాళ్ల: చాగంటివారిపాలెంలో అమ్మవారి దర్శనం



నకరికల్లు: శ్రీమహేశ్వరీదేవి అలంకరణలో అమ్మవారు



రాజుపాలెం: శ్రీలలితా త్రిపుర సుందరీదేవిగా దుర్గాదేవి

నేటి నుంచి ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లకు శిక్షణ తరగతులు

సత్తెనపల్లి: గ్రామ పంచాయతీ పరిపాలనపై మండలంలోని ఉప సర్పంచ్‌లు, గ్రామ పంచాయతీకి ఇద్దరు వార్డు మెంబర్లు చొప్పున ఈ నెల 7 నుంచి 10 వరకు రెండు విడతలుగా శిక్షణ జరుగుతుందని ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి ఆదివారం తెలిపారు. సోమ, మంగళ వారాల్లో కొమెరపూడి, కంటెపూడి, కట్టావారిపాలెం, నందిగామ, గుడిపూడి, లక్ష్మీపురం, పెదమక్కెన, గర్నెపూడి, లక్కరాజుగార్లపాడు, భీమవరం, అబ్బూరు, గండ్లూరు, దీపాలదిన్నె పాలెం గ్రామ పంచాయతీలకు మొదట విడతగా శిక్షణ జరుగుతాయన్నారు. 9, 10న భట్లూరు, గుజ్జర్లపూడి, గోరంట్ల, కట్టమూరు, రెంటపాళ్ళ, పాకాలపాడు, ఫణిదం, కంకణాలపల్లి, .దూళ్ళిపాళ్ల, భృగుబండ, కందులవారిపాలెం, గోగులపాడు గ్రామ పంచాయతీలకు రెండో విడత శిక్షణ జరుగుతుందన్నారు. శిక్షణ మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జరుగుతుందన్నారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, తాగునీరు, బిల్డింగ్ ప్లాన్, గ్రామ పంచాయతీ ఆస్తులు, వీధి దీపాలు, ఆర్థిక పరమైన అంశాలు, కోర్టు కేసులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలకు సంబంధించిన అంశాల పై శిక్షణనిస్తారని చెప్పారు. అన్ని గ్రామ పంచాయతీల ఉప సర్పంచ్‌లు, ఎంపికైన వార్డు మెంబర్లు శిక్షణ తరగతులను వినియోగించుకోవాలని కోరారు.

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

దాచేపల్లి : నగర పంచాయతీలో తొలగించిన పారిశుద్ధ్య కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ కార్మిక సంఘం నాయకుడు ముశ్యం వెంకటేశ్వర్లు చెప్పారు. నారాయణపురంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం రాజకీయ కారణాలతో పారిశుద్ధ్య కార్మికులను అన్యాయంగా విధుల నుంచి తొలగించిందన్నారు. వారిని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు షేక్ సైదా హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



అల్లుకున్న నిర్లక్ష్యం

నరసరావుపేట: పట్టణంలోని పలు రోడ్లలో గృహాలకు నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా అందజేసేందుకు ఏర్పాటుచేసిన ట్రాన్స్‌ఫార్మర్లపై అధికారుల నిర్లక్ష్యం కొనసాగుతుంది. ప్రకాష్‌నగర్ 60 అడుగుల రోడ్డులోని జెండా చెట్టు వీధి మూలమీద ఏర్పాటుచేసిన ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ముళ్లపొదలు, తీగలు అల్లుకొని ఉన్నాయి. వీటి ద్వారా పాములు, తొండలు, బల్లులు ట్రాన్స్‌ఫార్మర్‌పైకి చేరుకొని ఫీజులకు అడ్డుపడటంతో షార్ట్ సర్క్యూట్ అయి తరచుగా విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. పట్టణంలో ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ పెరిగిన ముళ్లపొదలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



ప్రకాష్‌నగర్ 60 అడుగు రోడ్డు జెండా చెట్టు వీధి మూలపై ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పెరిగిన పిచ్చిచెట్లు, తీగలు

ముమ్మరంగా వ్యవసాయ పనులు

శావల్యాపురం: మండలంలో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రైతులు వరి నాట్లు వేయడం, తదితర వ్యవసాయ పనుల్లో నిమగ్నం అయ్యారు. ఈసందర్భంగా మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు ఆదివారం మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామపంచాయతీల్లో ఖరీఫ్ సీజను వరకు 3500 వందల ఎకరాలు వరి పంట సాగు చేశారన్నారు. వ్యవసాయ అధికారుల పర్యవేక్షణలో రైతుసేవా కేంద్రం వీఏఏల సారథ్యంలో ఈ-పంట నమోదు పారదర్శకంగా పూర్తి చేయటంతో పాటు రైతుల బయోమెట్రిక్ నమోదు చేయటంతో జిల్లాలో శావల్యాపురం మండల ప్రథమస్థానం నిలిచినట్లు ఏఓ తెలిపారు. ప్రస్తుతం రబీ సీజను ప్రారంభం అయిందని ఏఓ వెల్లడించారు. ముఖ్యంగా రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు సలహాలు పాటించి ఆశించిన స్థాయిలో దిగుబడులు సాధించాలన్నారు. ఖరీఫ్‌లో సాగు చేసిన వరి పంట ఆశాజనకంగా ఉందన్నారు.

మద్యం షాపులకు దరఖాస్తుల ఆహ్వానం

ఈపూరు: నూతన మద్యం విధానంలో భాగంగా ఈపూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మూడు మండలాల్లో మొత్తం 9 మద్యం దుకాణాలకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో దరఖాస్తులను చేసుకోవాలని స్టేషన్ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ కె.శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ వద్ద టెండర్ విధానంపై వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్టేషన్ పరిధిలోని రొంపిచర్ల మండలంలో 4, బొల్లాపల్లి మండలంలో 3, ఈపూరు మండలంలో 2 మద్యం దుకాణాలకు ప్రకటన ఇవ్వడం జరిగిందని, ఆసక్తి ఉన్న వారు ప్రతి అప్లికేషన్‌కు రూ.2 లక్షలు నాన్ రిఫండబుల్ ఫీజు చెల్లించి దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 9వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని, 11వ తేదీన నరసరావుపేట ప్రకాష్ నగర్‌లోని టౌన్ హాల్‌లో లాటరీ తీయడం జరుగుతుందని వివరించారు.

కౌలు రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

క్రోసూరు: భారీ వర్షాల వల్ల నష్టపోయిన రైతులు, కౌలు రైతులకు ఎటువంటి ఆంక్షలు లేకుండా నష్ట పరిహారం అందించాలని కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో బయ్యవరం గ్రామ రైతులు తహసీల్దారు కె.శ్రీనివాసరావుకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి తిమ్మిశెట్టి హనుమంతరావు మాట్లాడుతూ పంట నష్టాన్ని బయ్యవరం కౌలు రైతులు రైతు సహాయ కేంద్రాల అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. అదేవిధంగా పలు మార్లు అధికారులు కలిసినప్పటికీ నష్ట పరిహారం చెల్లించే విషయంలో భూ యజమాలు అడ్డుకుంటున్నారని తెలిపారు. తహసీల్దారు స్పందిస్తూ.. విప్పర్ల , ఊటుకూరు రెవెన్యూ ప్రాంతాల్లో పంట ఎక్కువ నష్టపోయిన నేపథ్యంలో రెండోసారి కూడా నష్ట పరిహారం అంచనాలు వేసామని తెలిపారు. ఇప్పటికే కొంతమందికి నష్ట పరిహారం అందించడం జరిగిందన్నారు. మిగతా వారికి కూడా రెండవ దశలో నష్ట పరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకున్నామని రైతులు ఆందోళన చెందవద్దని అన్నారు. కౌలు రైతులు బండి మందిరం, జెర్రి పోతు శంకరు, బండి జ్యోతి , పిండం చిన్న నాగేశ్వరరావు,పెండెం చిన్న బాలనాగు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బయ్యవరం కౌలు రైతులు

సుఖమయ జీవనానికి యోగా దోహదం

నరసరావుపేట ఈస్ట్: నేటి ఒత్తిడితో నిండిన ప్రపంచంలో సుఖమయ జీవనానికి యోగా ఉత్తమ మార్గమని శ్రీవేంకటేశ్వర యోగా సేవా కేంద్రం (మంగళగిరి) వ్యవస్థాపకుడు వేంకటేశ్వర యోగి తెలిపారు. బరంపేటలోని శ్రీసీతారామ కల్యాణ మండపంలో గత నెలరోజులుగా నిర్వహించిన 179వ ఉచిత యోగా శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా అభ్యాసకులతో వేంకటేశ్వర యోగి ఆడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. శిబిరంలో శిక్షణ పొందిన ఆసనాలు, ధ్యానం, ఆహార నియమాలను నిత్యం పాటించటం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యంతో జీవించవచ్చని తెలిపారు. వినయ విధేయతలు, శాంతం, సహనంతో ఎంతటి సమస్యనైనా పరిష్కరించుకునే మానసిక స్థైర్యాన్ని యోగా అందిస్తుందని వివరించారు. ఈసందర్భంగా అభ్యాసకులకు జ్ఞాపికలు అందజేశారు. యోగా గురువు జల్లి శ్రీనివాసరావు, యోగా శిబిరం సహాయకులు గద్దం శ్రీనివాసరావు, రావూరి సాంబశివ రావు, ఆలయ కమిటీ ప్రతినిధులు రాఘవరపు చిన్ని, విజయరావు, గుబ్బా పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ పొందిన అభ్యాసకులతో యోగా గురువు శ్రీనివాసరావు

చిన్నారి ఆశ్వియ అంజుమ్ హత్యకు నిరసనగా ర్యాలీ

రేపు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహణ

నరసరావుపేట: చిత్తూరు జిల్లా పుంగనూరు పట్టణంలో గత నెల 29వ తేదీన అదృశ్యమైన ఆరేళ్ల చిన్నారి అశ్వియ అంజుమ్ హత్యకు నిరసనగా ఈనెల 8వ తేదీ ఉదయం 10 గంటలకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక గుంటూరు రోడ్డులోని పెద్ద మసీదు నుంచి గడియార స్తంభం సెంటర్‌లోని అంబేడ్కర్ బొమ్మ వరకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు.

అనంతరం నిందితులను సత్వరమే అరెస్టు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయటం జరుగుతుందన్నారు. పట్టణంలోని ముస్లిం సోదరులు, అన్ని ప్రజా సంఘాలు నాయకులు, ఏఐఎంఐఎం పార్టీ నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అందరూ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సాగరమాత ఆలయంలో భక్తుల ప్రార్థనలు



విజయపురి సౌత్: మాచర్ల మండలం విజయపురిసౌత్‌లోని పుణ్యక్షేత్రమైన సాగర మాత ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసెఫ్ బాల సాగర్ ఆధ్వర్యంలో దివ్యబలి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం నిర్వహించిన తేరు ప్రదక్షిణలో భక్తులు భారీగా పాల్గొన్నారు. తల నీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా ఆలయానికి తరలిరావడంతో ఆలయ పరిసర ప్రాంతాలు సందడిగా మారాయి.

9న సరస్వతి శిశు మందిర్‌లో అక్షరాభ్యాసం

సత్తెనపల్లి: మూలా నక్షత్రం సందర్భంగా పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 9న అక్షరాభ్యాసం జరుగుతుందని పాఠశాల బాధ్యులు ఆదివారం తెలిపారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించదలచిన వారు 93923 35903, 73861 62325 నంబర్లకు సంప్రదించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

ముప్పాళ్ళ: ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీ కొట్టిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండలంలోని గోళ్ళపాడు సమీపంలోని ఎస్టీ కాలనీ వద్ద శనివారం రాత్రి ద్విచక్ర వాహన్ని ఆటో ఢీ కొన్న ప్రమాదంలో రాజుపాలెం మండలం గణపవరానికి చెందిన కె.విద్యాసాగర్(31)కు తీవ్ర గాయాలైన ఘటన తెలిసిందే. గాయపడిన విద్యాసాగర్‌ను చికిత్స నిమిత్తం 108 వాహనంలో నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలిస్తుండగా మార్గ మధ్యలోనే మృతి చెందాడు. మృతుడు నరసరావుపేటలోని లలిత జ్యూయలర్స్‌లో పని చేస్తూ నిత్యం రాకపోకలు సాగిస్తుంటాడు. ఈ క్రమంలోనే ఇంటికి వెళుతుండగా కట్టమూరు నుంచి ఇంటిసామాను లోడుతో ఒంగోలు వెళుతున్న ఆటో ఢీకొట్టింది. జరిగిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వి.సోమేశ్వరరావు తెలిపారు.

ఈ-క్రాప్ బుకింగ్‌ను వేగవంతం చేయాలి

రెంటచింతల: ఈ-క్రాప్ బుకింగ్‌ను వేగవంతం చేయాలని మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు 92 శాతం ఈ-క్రాప్ బుకింగ్ పూర్తయిందని, ఈనెల 7 తేదీ సోమవారం సాయంత్రం నాటికి వందశాతం పూర్తి చేయాలన్నారు. ఈ ఏడాది 17,997 ఎకరాలలో వివిధ రకాల పంటలను రైతులు సాగుచేస్తున్నారని, ఇప్పటి వరకు సుమారు 16,210 ఎకరాల లో సాగుచేస్తున్న పంటల వివరాలను ఈ క్రాప్‌లో నమోదు చేసినట్టు వెల్లడించారు. ఇంకా 1,786 ఎకరాల పంటలను నమోదు చేయాల్సి ఉందని వెల్లడించారు.